బీడీలకో" అన్నాడు ముఖం ఇంకోవైపు పెట్టి. చచ్చినట్టు ఇంకో అణాకూడా ఇచ్చి బరువుగా కూలబడ్డాడు కారులో. పదిగజాలు పోయాక డ్రైవరు కారు ఆపి 'క్లీనర్ ఎక్కడా?' అన్నాడు. వాడెవడో సీటుగా తయారై అప్పుడే వచ్చాడు. "అయితే ఇందాకటివాడు క్లీనరు కాదన్నమాట?" అనుకుంటూ చూస్తున్నాడు జనార్దనరావు.

పదినిముషాల్లో బస్సు తను దిగే చోటికెళ్ళి ఆగింది. దిగాడు. తను ఇంటిదోవ పట్టాడు.

బస్సు చార్జీ, క్లీనర్ అనుకున్న మోసగాడికిచ్చిందీ కలిసి అణాతక్కువ రూపాయి. ఆ డబ్బులతో సైకిల్ రిక్షామీద ఎప్పుడో హాయిగా యింటికి వెళ్ళిపోను. తనమీద తనకే రోతవేసింది. అన్నీ తెలివితక్కువ పనులే! బుట్టెడు చామంతి పూలా? చెప్పులు కొందామని వెళ్తే బూట్లా!

ఆలోంచుకుంటూ అత్తవారింటికి జేరాడు. తన శ్రీమతి కాళ్ళకు నీళ్ళిస్తూ "ఏమిటీ అవతారం" అంది వెటకారంగా. "రామ రామ" అనుకున్నాడు మనస్సులో. ఇక ఎప్పుడూ ఇలా రాకూడదనుకున్నాడు. త్వరత్వరగా బట్టలు విడిచి మామూలుగా చొక్కా, లుంగీ వేసుకున్నాడు. "ఇప్పుడెంత బాగున్నారండీ!"అంటూ పాట పాడినట్లు మాట్లాడింది ఆవిడ. "ఎంతమంచిదీ" అనిపించిందతనికి.

పువ్వులపొట్లాం విప్పుతూ, "దారిలో దూడలు వెంటపడలే" అంటూ కిలకిలా నవ్వింది. తనూ నవ్వాడు. ఆమె కొంటెగా నవ్వింది. జనార్దనరావు తెల్లబోయాడు.

---

కథానిక

# మానవుడు-రాఘవులు

బి. రామనాథ్

ఆ రోజు ఆఫీసరుగారి అబ్బాయి పుట్టినరోజు. బంగళా అంతా అలంకరించారు. అబ్బాయిగారి స్నేహితులందరూ వచ్చారు. ఆఫీసరుగారూ, వారిసతీమణీ ఆ రోజు చాలా ఆనందోత్సాహాలతో విందుఏర్పాట్లు చేయించారు. రాఘవులు ఆ రోజు అసలు యింటికి వెళ్ళకుండా బంగళాలోనే ఉండిపోవలసి వచ్చింది. తోరణాలు వాకిళ్ళకు కట్టనూ, రంగుకాగితాలు కత్తిరించి అలంకరించనూ, విందుకు కుర్చీలూ టేబుల్సూ శుభ్రంగా తుడిచి సిద్ధం చేయనూ—రాఘవులు ఆ రోజు ఒక్కక్షణం కూర్చోలేదు. చిన్నబ్బాయిగారి పుట్టినరోజు పండగంటే అతనికీ సంబరంగానే ఉన్నది.

అతిథులంతా వచ్చారు. ఆఫీసరుగారే స్వయంగా ఆహ్వానించి లోనికి తీసుకువెళ్తున్నారు. ఎంతమంది పిల్లలొచ్చారో! వరండా అంతా, వచ్చిన పిల్లల పాదరక్షలతో నిండిపోయింది. రకరకాల స్లిప్పర్లూ—రంగురంగులబూట్లూ—చిన్న చిన్న చెప్పులూ!—రాఘవులు వరండా చివర గోడ కానుకుని కూర్చుని చూస్తున్నాడు. ఎన్నిచెప్పులు! ఎన్నిరకాలు! ఎంతబాగున్నయ్!

రాఘవులు అలాగే గోడకానుకుని ఆలోచిస్తున్నాడు...ఒక్కసారి తన పాదాలు చూసుకున్నాడు...చెప్పులులేని ఆ పాదాలు దుమ్ముతో మట్టితో కప్పుకుని పోయాయి. రాళ్ళరోడ్లమీద—ఎండలో—వానలో తిరిగి తిరిగి అరిగిపోయాయి! అయినా చెప్పులు కొనుక్కోడానికి కుదరకుండా వచ్చింది. చివరకి రంగడికికూడా తను చెప్పులు కొనలేకపోయాడు.

వాడు — ఆ పసివెధవ — అలాగే అవస్థపడుతూ మండుటెండలో వీధులన్నీ తిరిగి ఐస్ ఫ్రూట్ అమ్ముకుంటూ తనకి కొంతసహాయంగా ఉన్నాడు. నిప్పులుచెరిగే ఎండలో—కాళ్ళు మాడిపోయే ఆ ఎండలో వాడి లేతపాదాలు ఎంతగా కందిపోతున్నాయో! ఎంతకాల్తున్నాయో!

రోజూ ఇంటెదగ్గర వాడితల్లి పోరుతూనే ఉన్నది—"పిల్లవాడికి చెప్పులు కుట్టించవయ్యా!" అని. 'కుట్టిద్దాంలెద్దూ!...కాస్త చేతిలో చూసుకోవద్దూ?' అంటూ తనే రోజులు గడుపుతున్నాడు. మొన్న ఒకరోజు—ఎదురు దెబ్బ తగిలి, వాడి బొటనవ్రేలంతా రక్తంతో తడిసిపోయింది. ఏడుస్తూ

వచ్చాడింటికి...ఏంచేస్తాడు? రాఘవులు కళ్లల్లో నీళ్ళుతిరిగాయి. ఎందుకు తనబ్రతుకు? పసివాడికి ఒక చెప్పులజత కొనలేకపోతున్నాడు...పోనీ—ఆఫీసరుగారన్నా దయతలచి వారు తొడిగేసిన పాతచెప్పులన్నా యిస్తారేమోనని ఆశపడ్డాడు. అబ్బాయిగారికి చాలా జతలున్నాయి. కాని ఒక్కటీ సరిగా మాయదు! ఒక్కటీ తెగిపోదు! ఇదివరలో ఎప్పుడో ఒకసారి ఆఫీసరుగారే ఒకజత "తొడుక్కోరా!" అని యిచ్చారు. దాన్నే జాగ్రత్తగా తొడుక్కుని కాలక్షేపం చేశాడు రాఘవులు...అవీ చిరిగిపోయాయి. ఇక ఉపయోగంలేక మొన్నమొన్ననే పారేశాడు వాటిని. మళ్ళీ ఎప్పుడు దయకల్గుతుందో వారికి! అందాకా కాళ్ళుమాడుతూ ఉండాల్సిందే...

రాఘవులు ఆలోచిస్తూ కూర్చున్నాడు. లోపల విందు వైభవంగా జరుగుతోంది. అంతా నవ్వుకుంటూ మాట్లాడుకుంటూ ఫలహారాలారగిస్తున్నారు. సినిమా మాటలు గ్రామఫోనులోంచి మారు మ్రోగుతున్నాయి.

రాఘవులు మళ్ళీ చూశాడు—ఎన్ని చెప్పులు! ఎన్ని రకాలు!...ఉన్నట్లుండి అతనికి మెరపులాగా ఒక ఆలోచన వచ్చింది...అక్కడ-కిటికీ క్రింద ఉన్న నల్లటి స్లిప్పర్లు అతని దృష్టి నాకర్షించాయి. 'చాలా బావున్నాయి!' అనుకున్నాడు. 'రంగడికి సరీగా సరిపోతాయి!' అనుకుంటూ అటూ యిటూ చూశాడు ... కనుచూపుమేరలో ఎవరూ లేరు. నెమ్మదిగా లేచివెళ్లి ఆ నల్ల స్లిప్పర్లను తీసుకుని చిత్తుకాగితంలో చుట్టి చొక్కా ప్రక్క జేబులోకి నెట్టాడు...ఏమీ ఎరుగనట్లే మళ్ళీ వెళ్ళి వరండా చివర గోడకానుకుని కూర్చున్నాడు.

కూర్చున్నాడన్న మాటేగాని-రాఘవుల్ని రకరకాల ఆలోచనలు ముంచివేస్తున్నాయి ... ఏం చేశాడు తను? ... దొంగతనం!...దొంగతనంగా చెప్పులు దాచాడు!...ఇది ఎవరైనా చూస్తే—యిది ఎవరికైనా తెలిస్తే?...ఆఫీసరుగారికి తెలిస్తే? ఉద్యోగం ఉంటుందా? 'పోరా, దొంగ వెధవా!' అని గెంటెయ్యరూ? ... ఇంతకాలంబట్టి వాళ్ళ యింట్లో నౌకరుగా పనిచేస్తున్నాడు. కాని, ఇటువంటి పని యింతవరకూ చేసి ఎరుగడు! ఈ రోజు యిలా ఎందుకుచేయాలి? ఇది బయటపడితే ఇక తనమీద వాళ్ళకి నమ్మకం ఉంటుందా? రాఘవులు బెదరిపోయాడు.

ఆ...అయినా యీ సంగతి వాళ్ళకే తెలుసు? ఎలా తెలుస్తుంది? ఎవరు చూశారు? ఏ కుక్కలో ఎత్తుకుపోయాయనుకుంటారు. అందులో చివరగా ఉన్నాయి! కుక్క ఎందుకు తీసుకుపోకూడదు? గేటు తీసి ఉన్నప్పుడు ఎప్పుడో లోపలికి దూరి, నోట కరచుకునిపోయి ఉంటుంది. అవును! అంతా అలాగే అనుకుంటారు! తనమీద అనుమానం కల్గుతుందా! ఒకవేళ ఎవరికైనా కలిగినా, అబ్బాయిగారు, ఆఫీసరుగారు—ముఖ్యంగా అమ్మగారు అసలు నమ్ముతారా! తనమీద వాళ్ళ కెంత నమ్మకం! "రాఘవులలాంటి మనిషికాదు! వాడు యెప్పుడూ అలా చేయడు!" అని అనుమానాన్ని త్రోసిపారేస్తారు! ... రాఘవులు ఆలోచిస్తూ గోడ కానుకుని కాళ్లుముడుచుకుని కూర్చున్నాడు.

విందు ముగిసింది. అంతా వరండాలోకి వస్తున్నారు, తాంబూలాలు నములుతూ... కొందరు సెలవు పుచ్చుకుని వెళ్ళిపోతున్నారు ... పిల్లల హుషారుగా నవ్వుకుంటూ వెళ్తున్నారు...ఎవరి చెప్పులు వాళ్లు తొడుక్కుని వెళ్తున్నారు...ఒక పల్చని పిల్లవాడు కిటికీదగ్గరకు వెళ్ళి; వెతుకుతున్నాడు. రాఘవులు చూశాడు ... అవును. పాపం...అతనివే అయివుంటాయి యీ స్లిప్పర్లు! అతడు వెదికివెదికి, విసిగి లోపలికి వెళ్ళాడు.

ఏం జరుగుతుంది? అయ్యగారికి చెప్తాడా? రాఘవులు ఏమీ ఎరుగనట్లుగా వరండా దిగి గేటు తీసుకుని వీధిలోకి వెళ్లాడు. నెమ్మదిగా నడచి రోడ్డుమీద ఉన్న కిళ్ళీకొట్టుకు వెళ్లి ఒక బీడీ ముట్టించాడు. అక్కడే నిలబడి బీడీ కాల్చేసి, నెమ్మదిగా మళ్ళీ బంగళాకు వచ్చేశాడు.

"ఏం రాఘవులూ! ఎక్కడికి వెళ్ళావ్?... నీకోసం నాన్నగారు అడిగారు..." చిన్నబ్బాయిగారు అన్నారు, రాఘవులు గేటుతీసుకుని లోపలకు వెళ్ళగానే. వరాండాలో అబ్బాయిగారు, తమ స్నేహితులతో 'కేరమ్స్' ఆడుతున్నారు. వాళ్ళలో ఆ చారలచొక్కా పిల్లవాడుకూడా ఉన్నాడు.

రాఘవులు..."ఇక్కడికేబాబూ..." అంటూ బెరుకుగా లోపలికివెళ్ళాడు.

హాల్లో ఆఫీసరుగారు, వారిసతీమణీ, కూర్చుని, వారి స్నేహితులతో మాట్లాడుతున్నారు. రాఘవులు వెళ్ళి చేతులు కట్టుకుని నిలబడ్డాడు.

"వీడేనా?..." అని ప్రశ్నించారు స్నేహితులు.

"అవును— వీడే ... చాలామంచివాడు... మంచినమ్మకస్థుడు... నాలుగైదేళ్ళనించీ, మా యింట్లో పనిచేస్తున్నాడు... ఒక్కవస్తువు పోయినట్లుగానీ ఒక్కటి పాడయినట్లుగానీ లేదు!... **He is a true servant**" అంటూ చెబుతున్నారు, ఆఫీసరుగారు.

వారిమిత్రులు రాఘవుల్ని తేరిపారచూస్తూ, ఆయన చెప్పే మాటలకు తలలూపుతున్నారు. రాఘవులకిదేమీ అర్థం గావటంలేదు.

"ఏమోయ్!... ఏవూరుమీది?" మిత్రుల్లో ఒకరు అడిగారు.

"ఈ వూరేనండీ..." అన్నాడు రాఘవులు, నమ్రతతో.

"చాలా మంచివాడవని అయ్యగారు చెబుతున్నారు. అటువంటి నమ్మకం వారికి కల్గించినందుకు సంతోషం!..."

"ఏదోనండీ... అంతా వారి దయ..." రాఘవులు అన్నాడు, క్రుంగిపోతూ...

"మీరు చాలా అదృష్టవంతులండీ!...ఇల్లాంటి వాడు దొరకడం చాలకష్టం... మాకు ఒకడుండే వాడు ఉన్న నాలుగునెలల్లో కనీసం నాలుగైదు వస్తువులన్నా పోయినయ్! చివరికి విసుగుపుట్టి వాణ్ణి గెంటేశాం.."అంటూ చెబుతున్నారాయన, ఆఫీసర్ గారితో.

"అలాగా!... వెధవని పోలీసుల కప్పగించలేక పోయారూ?"అన్నారు అమ్మగారు.

రాఘవులు వారు మాట్లాడుకునే మాటలు వింటూ అలాగే నిలబడ్డాడు.

కొంతసేపటికి వాళ్ళు లేచి సెలవుతీసుకుని వెళ్ళిపోయారు. ఇంతలో వరాండాలోంచి అబ్బాయిగారు వచ్చి, "నాన్నగారూ! మోహన్ యింటికెళ్తానంటున్నాడండీ"అన్నాడు.

ఆఫీసరుగారు, "వాడి స్లిప్పర్లు దొరికాయా?" రాఘవులు అదిరిపడ్డాడు.

"దొరకలేదండీ"అన్నారు అబ్బాయిగారు.

"ఊఁ!...ఏ సుక్కో నోటగరచుకుని పోయి ఉంటుంది. వెళ్తానంటున్నాడా! ఏరా మోహన్?"

మోహన్ వచ్చాడు—"అవునండి, వెళ్తాను. మళ్ళీ సాయంకాలం వస్తాను"అన్నాడు.

"...సరే! ఎండగా ఉన్నట్లుంది, జాగ్రత్త... మీ నాన్నగారితో ఒకసారి నేను కనపడమన్నానని చెప్పు. యిదుగో, రాఘవులూ! నీవూ వెళ్ళి అబ్బాయిని యింటిదగ్గర వదలిరా."

"అలాగే బాబయ్యా!"...అంటూ రాఘవులు అక్కడనుండి పయటపడ్డాడు...

మోహన్, రాఘవులూ వీధిలో నడుస్తున్నారు. ఎండ విపరీతంగాఉంది. తారు రోడ్డు, కాళ్ళ మాడుతున్నాయి. రాఘవులు నడవలేక పోతున్నాడు. అరికాళ్ళు మంటలెత్తుతున్నాయి. పాపం! పసివాడు—మోహన్ ఎలా నడుస్తున్నాడోనని చూశాడు...వాడు బిక్కమొహంతో నడవలేక చెట్టుక్రింద ఆగాడు. రాఘవులు కూడా ఆగి, వాడి దగ్గరకు వెళ్లాడు...

"ఏంటి బాబూ?..."

"కాళ్ళు కాలుతున్నాయ్..." అన్నాడు మోహన్.

"అయితే, రిక్షాలో వెళ్లుదామా?"

"వద్దు...అసలే నా చెప్పులు పోయినాయని తెలిస్తే మా నాన్నగారు వీపు పగల కొడ్తారు. రిక్షాకూడా ఎక్కివెళ్తే ఇంకా ఏమన్నా ఉందా?.." మోహన్ కళ్ళలో నీళ్లుచూసి రాఘవులు బిత్తర పోయాడు.

"అయితే నెమ్మదిగా పదండి, బాబూ..." అన్నాడు.

మోహన్ మళ్ళీ నడక సాగించాడు, కళ్ళు తుడుచుకుని, ఇంకా సగం దూరమైనా రాలేదు. పసివాడి పాదాలు కందిపోతున్నాయి. తారు రోడ్డుమీద అంటుకుపోతున్నాయి. మోహన్ అమాయకవదనాన్నీ, నీళ్ళుతిరిగే కళ్లనీచూస్తూంటే రాఘవులు మనస్సంతా కలచినట్లుంది. పసివాడిని కష్టపెడుతున్నాడు తను! ఎందుకు చేశాడాపని!.. రాఘవులు క్రుంగిపోతున్నాడు... కాళ్లు తడబడుతున్నాయి. విపరీతంగా ఉన్నది—వడగాలి. పైన నెత్తీ, క్రింద కాళ్ళూ మాడుతున్నాయి. మోహన్ని చూస్తూంటే రాఘవులికి తన కొడుకు

కళ్ళల్లో మెదిలాడు. వాడూ ఇలాగే ఎండలో—కాళ్ళు మాడ్తూంటే ఎక్కడో తిరుగుతూ, 'ఐస్ ఫ్రూట్' అమ్ముతూంటాడు ... ఏ పేటలో ఉన్నాడో!...ఎంత ఎండ!...ఈ ఎండలో అసలు పసివాళ్ళని, వీధిలోకి పంపడమే తప్పు!...

ఆలోచిస్తూ రాఘవులు మళ్ళీ ఒక చెట్టుక్రింద ఆగాడు. మోహన్ ఇక భరించలేక, భోరుమని ఏడ్వసాగాడు. అతని పాదాలు బొబ్బలెక్కుతున్నాయి...రాఘవులు ఆలోచించాడు. ఎంత పని చేశాడు!...ఎవరో అతణ్ణి ఒక ముల్లుకర్రతో పొడుస్తున్నట్లుంది — "తీయ్ — బయటికితీసి ఆ చెప్పులు వాడికిచ్చేయ్! — పసివాడి పాదాలు చూడు, ఎంత కందిపోయాయో! సిగ్గులేదూ నీకు?—నీ పిల్లవాడొకటీ, వీడొకటీనా? వీడుమాత్రం పసివాడు కాడూ? అయినా, వీడిచెప్పులు తీసుకుని నీ కొడుక్కివ్వటానికి నీకేం అధికారం ఉంది?... వెధవపని చేశావు! ముందు జేబులోంచి తీసి వాడి కాళ్ళకు తొడుగు! మనిషివిరా నువ్వు! పశువులాగా ప్రవర్తించకు!"

రాఘవులు ఆగాడు...నెమ్మదిగా చెప్పులు తీశాడు.

"ఇవేనా బాబూ...మీ చెప్పులు?" అన్నాడు.

"ఆ! ... యివ్వే! ... ఎక్కడివి?" అన్నాడు మోహన్, ఎగిరి గంతేసి.

"యిందాక...తోటలో చెట్టుకింద ఒకకుక్క తెచ్చిపడేసింది బాబూ!...దాన్నితోలి, తీశాను. ఎవరివో — అనుకున్నాను! నామతిమండ!...ఆ సంగతే మఱచిపోయాను!...యిదిగో—తొడుక్కోండి బాబూ!..."

ఇల్లుచేరారు ... మోహన్ యింట్లోకి పరుగెత్తాడు. మోహన్, తల్లితో అంటున్నాడు... "మరే—నా స్లిప్పర్లు కుక్క ఎత్తుకుపోయిందమ్మా! పోయినయ్యనుకున్నాను. ఈ రాఘవులు కుక్కనుతోలి చెప్పులు తీసుకువచ్చియిచ్చాడు. ఈ రాఘవులు మంచివాడమ్మా! నాకు వాళ్ల ఆనంద్ కూడా చెప్పాడు!..."

రాఘవులు తలవంచుకుని— "వెళ్తానమ్మా..." అని వీధిలోకి వచ్చేశాడు.

రాఘవులు మనిస్సు తేలికపడింది. ఉత్సాహంగా నడకసాగించాడు, ఇకఎప్పుడూ అల్లాంటి పని చేయకూడదని గట్టిగా అనుకున్నాడు రాఘవులు.

బంగళా చేరాడు. ఆఫీసరుగారు రాఘవుల్ని పిలిచి, "మోహన్ బాబు యింటికి వెళ్లాడా?" అని అడిగారు. "నేనూవెళ్లి వదలిపెట్టి వచ్చానండి..." అన్నాడు రాఘవులు.

"ఊ...కూర్చోరాఘవులూ, ఫలహారం చెయ్యి..." అంటూ ఆఫీసరుగారు యింట్లోకి వెళ్లారు.

అమ్మగారు ఫలహారాల పొట్లం తీసుకువచ్చి రాఘవులు ముందుంచారు.

"ఇప్పుడివన్నీ దేనికమ్మగారూ!..." అన్నాడు రాఘవులు.

"ఇప్పుడు కాదోయ్!...యింటికి తీసుకునివెళ్లు. యింట్లో మీ ఆవిడకూ, పిల్లవాడికీ యియ్యి... యిదుగో యీచీరె, రవికెలగుడ్డా మీ ఆవిడకు అంటూ ఒక కెంపురంగు చీరె, తెల్లనిగుడ్డా రాఘవులి వళ్లో పడవేసింది.

ఇంతలో ఆఫీసరుగారు ఒక ధోవతి ఉత్తరీయం తెచ్చి రాఘవులిచేతికిచ్చారు. అబ్బాయిగారు వచ్చి తాంబూలంతో ఒకటి చేతికిచ్చి, ఒక చిన్న చొక్కా, లాగూ అందించారు.

రాఘవులి సంతోషాని కంతం లేకపోయింది. మాటలురాలేదు. అలాగేచూస్తూ ఉండిపోయాడు.

"అబ్బాయి పుట్టినరోజుకు యిది సంతోషంగా తీసుకో రాఘవులూ!" అన్నారు ఆఫీసరుగారు...

రాఘవులులేచి, వారికి నమస్కారంచేసి బయటకు వచ్చేశాడు. చేతిలో తాంబూలం చూసుకున్నాడు. అందులో — పదిరూపాయల కాగితం!

తేలిపోయే మనస్సుతో రాఘవులు ఆరోజు బజారువెళ్లి తన కొడుక్కి ఒక చెప్పులజత కొనుక్కొని యింటికి తీసుకువెళ్లాడు. పిల్లవాడు చెప్పులు తొడుక్కొని 'ఐస్ ఫ్రూట్' డబ్బా తీసుకుని వెళ్తూంటే—రాఘవులు—మధ్యాహ్నం జరిగిన విషయాలన్నీ తల్చుకుని దీర్ఘంగా నిట్టూర్చాడు... "అబ్బాయిగారికి వెయ్యేళ్లు ఆయుష్షు..." అంటూ చేయెత్తి నమస్కరించాడు రాఘవులు. ★